క్లుప్తంగా

పోలీసులు అప్రమత్తంగా ఉండాలి : డీసీపీ



నందిగామ: ఎన్నికల నేపథ్యంలో పోలీసు సిబ్బంది అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని విజయవాడ రూరల్ డీసీపీ కె.శ్రీనివాసరావు ఆదేశించారు. పట్టణ పోలీస్‌స్టేషన్‌ను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఇన్‌స్పెక్టర్ హనీష్, సిబ్బందికి పలుసూచనలు చేశారు. ఈసందర్భంగా డీసీపీ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. డీసీపీ వెంట నందిగామ ఏసీపీ బి.రవికిరణ్ ఉన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన



వీరులపాడు: గ్రామంలో ముత్యాలమ్మ అమ్మవారు, పోతురాజు ఆలయ పునర్నిర్మాణ పనులకు గ్రామస్తులు బుధవారం శంకుస్థాపన చేశారు. గ్రామంలోని ఎస్సీకాలనీలో 300 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ ఆలయం పూర్తిగా శిథిలం కావడంతో పునర్నిర్మాణ పనులు చేపట్టేందుకు గ్రామస్తులు శంకుస్థాపన చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఉలవలపూడి నాగేశ్వరరావు, అద్దంకి పోతురాజు, అద్దంకి వెంకటేశ్వర్లు, అద్దంకి పుల్లారావు, కోపూరి రాజ్‌కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



జగ్గయ్యపేట: పట్టణంలోని తపోవన్ విద్యాలయంలో రెండురోజులుగా జరుగుతున్న పాఠశాల కల్చరల్, గ్రాడ్యుయేషన్ డే వేడుకలు మంగళవారం రాత్రితో ముగిశాయి. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ప్రిన్సిపల్ సుధీర్‌బాబు, డైరెక్టర్లు రాధాకృష్ణ, శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

క్రిస్టియన్ విభాగం అధ్యక్షుడిగా ఆనందపాల్



జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ విభాగం అధ్యక్షునిగా బి.ఆనందపాల్ నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ విభాగం జారీచేసిన నియామకపత్రాన్ని జగ్గయ్యపేట ఎమ్మెల్యే, విప్ ఉదయభాను, ఆనందపాల్‌కు ఆయన నివాసంలో బుధవారం అందజేసి అభినందించారు. తన నియామకానికి కృషిచేసిన సామినేని ఉదయభానుకు ఆనంద్‌పాల్ కృతజ్ఞతలు తెలియజేశారు. కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నామినేషన్ల స్వీకరణపై అవగాహన

జగ్గయ్యపేట అర్బన్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఈనెల 18వ తేదీ నుంచి జరగనున్న నామినేషన్ల కార్యక్రమానికి సంబంధించి ఎన్నికల స్పెషల్ కౌంటర్ సిబ్బందికి బుధవారం అవగాహన స కల్పించారు. నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్ జి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నామినేషన్ల స్వీకరణ సమయంలో సిబ్బంది పాటించాల్సిన నిబంధనలపై వారికి అవగాహన కల్పించారు. ఏఈఆర్వో, పేట తహసీల్దార్ శేషగిరి, మున్సిపల్ కమిషనర్ సీహెచ్.నాగమల్లేశ్వరరావు, పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాల తహసీల్దార్లు వి.అమ్మాజీ, కె.సూర్యారావు, పేట, పెనుగంచిప్రోలు, వత్సవాయి ఎంపీడీవోలు రమేష్‌బాబు, హర్ష సాయి, చైతన్య పాల్గొన్నారు.

ఘర్షణలకు దిగితే కఠిన చర్యలు : ఎస్‌ఐ

మల్కాపురం(జగ్గయ్యపేట): మే 13వతేదీన జరగనున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేలా అందరూ సహకరించాలని చిల్లకల్లు ఎస్‌ఐ సతీష్ కోరారు. మల్కాపురంలో బుధవారం రాత్రి అన్ని రాజకీయపార్టీల నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఘర్షణలకు పాల్పడవద్దని గ్రామస్తులకు సూచించారు. ఘర్షణలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇవ్వడంతోపాటు కొందరిని బైండోవర్ చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

పింఛన్.. టెన్షన్

- వృద్ధులకు తప్పని అవస్థలు..
- పింఛన్ కోసం పండుటాకుల ఎదురుచూపులు
- ఈ దుస్థితికి చంద్రబాబే కారణమని మండిపాటు

పెనుగంచిప్రోలు /నందిగామ: గత టీడీపీ ప్రభుత్వ పాలనలో పింఛన్ కోసం పింఛన్‌దారులు పడిన కష్టాలు, టీడీపీ అధినేత చంద్రబాబు, ఆయన అనుయాయుల ఫిర్యాదుల కారణంగా తిరిగి ప్రారంభమయ్యాయి. వలంటీర్ల ద్వారా పింఛన్ పంపిణీ వద్దని చంద్రబాబు మనుషులు ఎన్నికల కమిషన్, కోర్టులకు సైతం వెళ్లి..ఎన్నికలు పూర్తయ్యేవరకు వలంటీర్ల సేవలను నిలుపుదల చేయించారు. దీంతో గత 58నెలలుగా ఠంఛన్‌గా ప్రతినెలా ఒకటోతేదీనే అందుతున్న పింఛన్ కాస్తా, టీడీపీ నిర్వాకం కారణంగా తీవ్రజాప్యానికి కారణమైంది. పింఛన్‌దారులకు బుధవారం మధ్యాహ్నం నుంచి పింఛన్ పంపిణీ చేస్తామని అధికారులు చెప్పడంతో నందిగామ డివిజన్ పరిధిలోని ఆయా గ్రామాల్లోని పింఛన్‌దారులు ఉదయం నుంచి సచివాలయాల వద్ద బారులు తీరారు. వేసవి ఎండల తీవ్రతను తట్టుకోలేక తీవ్ర ఇబ్బందులుపడ్డారు. మధ్యాహ్నం నుంచి పింఛన్ పంపిణీ ప్రారంభమైనప్పటికీ వచ్చినవారందరికీ పింఛన్ అందలేదు. కొంతమందిని గురువారం ఉదయం సచివాలయాలకు రావాలని చెప్పడంతో వృద్ధులు తీవ్ర ఆవేదన వ్యక్తంచేశారు. మూడురోజులుగా పింఛన్ కోసం ఎదురుచూస్తున్నామని, ఎన్నికల కోడ్ రానంతవరకు సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రతినెలా ఒకటోతేదీనే వలంటీర్ల ద్వారా పింఛన్‌ను అందించారని గుర్తుచేస్తున్నారు. టీడీపీ నాయకుల దరిద్రపుగొట్టు ఫిర్యాదుల కారణంగా వలంటీర్ల సేవలు నిలిచిపోయి తమకు ఈ దుస్థితి ఏర్పడిందని వారు లబోదిబోమంటున్నారు. ఎన్నికలకు, పింఛన్ పంపిణీకి సంబంధమేమిటని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. చంద్రబాబు నీతిమాలిన పనుల కారణంగానే ఈపరిస్థితి వచ్చిందని, ఆయనకు తమ ఉసురు తప్పక తగులుతుందని శాపనార్థాలు పెట్టారు. మంచం మీద నుంచి కదలలేని స్థితిలో ఉన్న తమలాంటి వారికి ఈ పరిస్థితి తెచ్చిన చంద్రబాబుకు, ఆయన పార్టీకి తగిన బుద్ధి చెబుతామని పలువురు వృద్ధులు మండిపడ్డారు.



నవాయిపేటలో పింఛన్ కోసం ఎండలో క్యూలైన్‌లో నిల్చున్న వృద్ధులు, వితంతువులు, వికలాంగులు



నందిగామలో పింఛన్‌కోసం ఆటోలో వస్తున్న వృద్ధురాలు



అల్లూరులో పింఛన్ కోసం ఎదురు చూస్తున్న వృద్ధులు

గంటల తరబడి ఎదురుచూపుల తర్వాత ఎట్టకేలకు మధ్యాహ్నం తర్వాత సచివాలయ ఉద్యోగులు పింఛన్ల పంపిణీని ప్రారంభించారు.

జగ్గయ్యపేట పట్టణంలో..

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట మున్సిపాలిటీ పరిధిలో బుధవారం పింఛన్ల పంపిణీ ప్రహసనంగా మారింది. మంచం మీద నుంచి లేవలేని వారు, నడవలేని వారు సచివాలయాలకు వెళ్లి పింఛన్లు తీసుకోవడానికి అనేక కష్టాలుపడ్డారు. గతంలో వలంటీర్లు ఒకటోతేదీనే పింఛన్ ఇవ్వగా, ఈసారి మూడురోజుల తర్వాత కూడా సచివాలయానికి వెళ్లి మరీ గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని లబ్ధిదారులు వాపోయారు. టీడీపీ కుట్రల కారణంగానే వలంటీర్లు ద్వారా తమకు పింఛన్ పంపిణీ జరగకకుండాపోయిందని పలువురు లబ్ధిదారులు మండిపడ్డారు. పట్టణంలో చేపట్టిన పింఛన్ పంపిణీని మున్సిపల్ కమిషనర్ నాగమల్లేశ్వరరావు పరిశీలించారు. పింఛన్ కోసం సచివాలయానికి వచ్చే లబ్ధిదారులు కూర్చునేందుకు వీలుగా షామియానాలు, కుర్చీలు ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

రెండు గ్రామాల్లోనే పింఛన్ల పంపిణీ..

నందిగామ: నందిగామ నియోజకవర్గ పరిధిలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం బుధవారం మధ్యాహ్నం తర్వాత ప్రారంభం కావడంతో వృద్ధులు, వికలాంగులు గంటల తరబడి సచివాలయాల వద్ద వేచి ఉండలేక అవస్థలు పడ్డారు. నందిగామ నియోజకవర్గ పరిధిలో మొత్తం 42,340మంది పింఛన్‌దారులు ఉన్నారు. నందిగామ మండలంలో కేవలం కొణతమాత్మకూరు, కేతవీరునిపాడు గ్రామాల్లో మాత్రమే పింఛన్ పంపిణీ కార్యక్రమం జరిగింది. మిగిలిన గ్రామాలలో గురువారం నుంచి పింఛన్ పంపిణీ చేస్తామని చెప్పడంతో లబ్ధిదారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ సచివాలయాల వద్ద నుంచి ఇళ్లకు వెనుదిరిగారు. నందిగామ పట్టణంలోని 10సచివాలయాల పరిధిలో సామాజిక పింఛన్ పొందేవారు 4,351 మంది ఉండగా వారిలో రాత్రి 7 గంటల సమయానికి 3,110మందికి పింఛన్ అందజేసినట్లు మున్సిపల్ కమిషనర్ కె.హేమమాలిని తెలిపారు.



పింఛన్ కోసం కంచికచర్ల సచివాలయం వద్ద ఉదయం నుంచి వేచి ఉన్న పింఛన్‌దారులు

కంచికచర్ల మండలంలో..

కంచికచర్ల : మండలంలో పింఛన్ కోసం లబ్ధిదారులు సచివాలయాల వద్ద బారులు తీరగా, బుధవారం మధ్యాహ్నం తర్వాత ప్రారంభించారు. మండలంలో 10,679మంది పింఛన్‌దారులు ఉన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు కుట్రల కారణంగా ఈసారి మూడురోజులుగా అందకపోవడంపై లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పింఛన్‌కోసం సచివాలయాల వరకు నడవలేక వృద్ధులు ఆటోలు, రిక్షాలను ఆశ్రయించ తప్పలేదు.

చందర్లపాడు మండలంలో...

చందర్లపాడు(నందిగామ టౌన్): చందర్లపాడు మండలంలో పింఛన్‌ల పంపిణీ ప్రహసనంగా సాగింది. వృద్ధులు, వికలాంగులు ఉదయం నుంచే ఆయా గ్రామాల్లోని సచివాలయాల వద్ద పడిగాపులు కాశారు. మధ్యాహ్న సమయంలో ఎండ వేడిమి, వడగాలులకు పండుటాకులు నానా ఇబ్బందులు పడ్డారు. గతంలో వలంటీర్‌లు ఇంటికి వచ్చి పింఛన్ అందించే వారని, చంద్రబాబు పుణ్యమాని ఎండల్లో పడిగాపులు కాయాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల కమిషన్‌ను అడ్డుపెట్టుకుని నిరుపేదలకు మంచిచేస్తున్న వలంటీర్ వ్యవస్థ సేవలను అడ్డుకున్న చంద్రబాబుకు రానున్న ఎన్నికలలో తగిన బుద్ధిచెప్పడం ఖాయమని లబ్ధిదారులు స్పష్టం చేశారు.

వీరులపాడు మండలంలో...

వీరులపాడు: పింఛన్ తీసుకునేందుకు వృద్ధులు, వికలాంగులు బుధవారం నానాపాట్లు పడ్డారు. నిన్న మొన్నటి వరకు ఇంటివద్దకు వచ్చి పింఛన్ అందించిన వలంటీర్ల సేవలు..టీడీపీ అధినేత చంద్రబాబు, ఆయన అనుయాయుల కారణంగా నిలిచిపోవడంతో లబ్ధిదారులు ఇబ్బందిపడ్డారు. ఆయా గ్రామాల్లోని సచివాలయాల వద్ద గంటల తరబడి వేచి ఉండలేక అవస్థలుపడ్డారు. చంద్రబాబు చేసిన పనికి తాము ఇన్ని అవస్థలు పడాల్సివస్తోందని, ఆయనకు మా ఉసురు తప్పక తగులుతుందని పింఛన్‌దారులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈ వయస్సులో బాధపెట్టారు..



గతంలో చంద్రబాబు పాలనలో పింఛన్ కోసం పంచాయతీ ఆఫీసు వద్ద పడిగాపులు కాశాం. జగన్‌బాబు సీఎం అయ్యాక పింఛన్‌ను ఇంటికే తెచ్చిఇస్తున్నారు. 85ఏళ్ల పైబడిన మమ్మల్ని గతపాలనలో మాదిరి పింఛన్ కోసం ఇబ్బందిపెట్టడం మంచిపద్ధతి కాదు.

– రావూరి కోటమ్మ, పెనుగంచిప్రోలు

పక్షవాతంతో నడవలేకపోతున్నా..



గ్రామంలోని తూర్పు బజారు నుంచి కిలోమీటర్ దూరంలో ఉన్న సచివాలయానికి వచ్చేందుకు ఆటో అడిగితే రూ.100 అడిగారు. పక్షవాతంతో నడవలేనిస్థితిలో ఉన్నా..చేసేదేమిలేక మండుటెండలో స్టాండ్ పట్టుకుని నడుచుకుంటూ వచ్చాను.

– నరసింహారావు, పెనుగంచిప్రోలు

వలంటీర్లు ఉంటే బాగుండేది..



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ చాలా బాగుంది. ఇన్నాళ్లు ఇంటివద్దకే వలంటీర్ ఇంటికే వచ్చి పింఛన్‌ను అందించారు. ఇప్పుడు చంద్రబాబు అనుయాయుల ఫిర్యాదు కారణంగా పింఛన్ కోసం తిప్పలు తప్పడం లేదు.

– వెల్డి పాపాచారి, మక్కపేట

మా ఉసురు తగులుతుంది..



తొంభై ఏళ్ల వయస్సులో పింఛన్ కోసం సచివాలయానికి వెళ్లాలంటే ఎంతో ఇబ్బందిగా ఉంది. ఎవరికి ఏమాయ రోగం వచ్చిందో వలంటీర్లను మాఇళ్లకు రాకుండా చేశారు. వాళ్లకు మా ఉసురు తగులుతుంది.

– అన్నం ధనమ్మ, మిట్టగూడెం

ఎదురుచూపులు తప్పలేదు..



పింఛన్ కోసం మూడురోజులుగా ఎదురుచూస్తున్నాం. వలంటీర్లతో పింఛన్ పంపిణీ వద్దని పిటీషన్ పెట్టారంట. ఉదయం వస్తే సాయంత్రానికి పింఛన్ ఇచ్చారు. జగన్‌బాబు మళ్లీ సీఎం అయితేనే మాకు ఈ తిప్పలు తప్పుతాయి.

– పేరం నాగమణి, జగ్గయ్యపేట



జగ్గయ్యపేటలోని కాకానినగర్‌లో పింఛన్ కోసం ఎదురు చూస్తున్న వృద్ధులు

పింఛనే నాకు ఆధారం..



వలంటీర్లు ఒకటో తేదీ పొద్దేనే ఇంటికి వచ్చి పింఛన్ అందించేవారు.పింఛన్ వస్తేనే నాకు ఇల్లు గడిచేది. కాని ఈనెల మూడోతేదీ పూర్తవుతున్నా ఇప్పటివరకు పింఛన్ అందలేదు. పింఛన్ అందక ఇంటి అవసరాల కోసం మూడురోజులుగా అవస్థలు పడుతున్నాను.

– నోముల లక్ష్మీకాంతం, నందిగామ

సచివాలయం వరకు ఎలా వెళ్లాలో..



నేను డయాలసిస్ రోగిని. ప్రభుత్వం అందిస్తున్న రూ.10వేల పింఛన్‌తోనే ఇల్లు గడుస్తోంది. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా వైద్యం చేయించుకుంటున్నాను. ఇప్పటి వరకు వలంటీర్‌లు వచ్చి పింఛన్ అందించారు. ఇప్పుడు పింఛన్ కోసం సచివాలయానికి ఎలా వెళ్లాలో అర్థం కావడం లేదు.

– రావిశెట్టి లక్ష్మీకాంతరావు, జుజ్జూరు

ఈసారి ఇబ్బందిగా ఉంది..



నేను దివ్యాంగురాలిని. ఇప్పటివరకు వలంటీర్ తలుపు తట్టి మరీ పింఛన్ అందించి యోగక్షేమాలు తెలుసుకునేవారు. ఎన్నికలను అడ్డం పెట్టుకుని చంద్రబాబు వలంటీర్‌లను తప్పించారు. దీంతో పింఛన్ తీసుకునేందుకు నానా ఇబ్బందులు పడుతున్నాం. చంద్రబాబుకు మా ఉసురు తప్పక తగులుతుంది.

– పసుపులేటి సరోజిని, జుజ్జూరు

పింఛన్‌కు రేపు రమ్మన్నారు..



పింఛన్లు బుధవారం మధ్యాహ్నం నుంచి పంపిణీ చేస్తామని చెప్పడంతో వచ్చాను. కాని ఈరోజు పంపిణీ చేయలేదు. పింఛన్ కోసం గురువారం ఉదయం రమ్మంటే తిరిగి వెళ్తున్నాను. గతంలో వలంటీర్లు ఒకటో తేదీనే పింఛన్ ఇచ్చేవారు. ఈసారి అలాకాకుండా ఇబ్బంది పెడుతున్నారు.

– బత్తుల నరసింహారావు, నందిగామ

సెక్టార్ అధికారులతో ఆర్డీవో సమీక్ష

నందిగామ: ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని నందిగామ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో ఏ రవీంద్రరావు సూచించారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో బుధవారం ఆయన సెక్టార్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల్లో కల్పించాల్సిన వసతులు, ఏర్పాట్లపై చర్చించారు. ఈసందర్భంగా ఆర్డీవో రవీంద్రరావు మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని అన్ని పోలింగ్ స్టేషన్లలో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ఎన్నికల రోజు ఓటర్లు ఇబ్బంది పడకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎన్నికలు విజయవంతంగా నిర్వహించుకునేందుకు విధులు నిర్వహించే అందరూ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ముఖ్యంగా సెక్టార్, రూట్, పోలింగ్‌కేంద్రాలస్థాయి అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈనెల 14వ తేదీన పట్టణంలోని కెవిఆర్ కళాశాలలో పిఒ, ఏపీఓలకు నిర్వహించే శిక్షణకు సెక్టార్ అధికారులు కూడా హాజరు కావాలని ఆదేశించారు. సమావేశంలో నందగామ, కంచికచర్ల,వీరులపాడు, చందర్లపాడు తహసిల్దార్లు వై.సరస్వతి, వి.స్వాగతం,కె.రాజకిషోర్, మురళీధర్, మున్సిపల్ కమిషనర్ కె.హేమమాలిని, ఎలక్షన్ డీటీ ఇస్మాయిల్, సెక్టార్ అధికారులు పాల్గొన్నారు.



సెక్టార్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఆర్డీవో రవీంద్రరావు

పింఛన్ల పంపిణీ పర్యవేక్షణ

నందిగామ: పట్టణ పరిధిలోని అన్ని సచివాలయాల్లో పింఛన్ కోసం వచ్చేవారు ఇబ్బంది పడకుండా ఉండేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ కె.హేమమాలిని తెలిపారు. సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని నందిగామ పట్టణ పరిధిలో బుధవారం మధ్యాహ్నం నుంచి ప్రారంభించారు. పట్టణంలోని 10 సచివాలయాల్లో ప్రారంభమైన పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ హేమమాలిని పర్యవేక్షించారు. పింఛన్ కోసం వచ్చేవారు ఇబ్బంది పడకుండా ఉండేందుకు కుర్చీలు, తాగునీరు ఏర్పాటు చేసినట్లు కమిషనర్ వివరించారు.

వలంటీర్ల మూకుమ్మడి రాజీనామా



పెనుగంచిప్రోలు ఎంపీడీవో హర్షసాయికి రాజీనామా పత్రాలు అందిస్తున్న వలంటీర్లు

గనిఆత్కూరు(కంచికచర్ల) : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వలంటీర్ల సేవలను నిలుపుదల చేయాలంటూ రాష్ట్ర ఎన్నికల మాజీ కమీషనర్ నిమ్మగడ్డ రమేష్ నేతృత్వంలో సిటిజన్ ఫర్ డెమొక్రసీ సంస్థ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడంపై మనస్తాపం చెందిన మండలంలోని గనిఆత్కూరు గ్రామ వలంటీర్లు 16మంది బుధవారం మూకుమ్మడిగా రాజీనామా చేశారు. ఈమేరకు వలంటీర్లు వారి రాజీనామా పత్రాలను ఎంపీడీవోకు అందజేశారు. ఐదేళ్లుగా వలంటీర్లుగా పనిచేస్తూ పేదలందరికీ సేవలందిస్తున్న తమపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడం తగదన్నారు. గతంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అచ్చన్నాయుడు కూడా వలంటీర్లపై ఫిర్యాదు చేశారని వారు గుర్తుచేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ ముసుగులో కొందరు వ్యక్తులు ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడుతున్న వైనాన్ని ప్రజలు గమనించాలని వారు కోరారు.

పెనుగంచిప్రోలు మండలంలో...

పెనుగంచిప్రోలు: నిస్వార్థంగా పేదలకు సేవలందిస్తున్న వలంటీర్లపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడంతో మనస్తాపం చెందిన పెనుగంచిప్రోలులోని ఆయా గ్రామాలకు చెందిన వలంటీర్లు బుధవారం మూకుమ్మడిగా రాజీనామాలు చేశారు. పెనుగంచిప్రోలులోని 1,2,3సచివాలయాలకు చెందిన 26మంది వలంటీర్లు కొణకంచిలో తొమ్మిది మంది, ముండ్లపాడులో 15మంది, నవాబుపేటలో 15 మంది, అనిగండ్లపాడు–1 సచివాలయానికి చెందిన ఇద్దరు వలంటీర్లు రాజీనామాలు చేశారు. ఈ మేరకు వారు ఎంపీడీవో హర్షసాయిని కలిసి తమ రాజీనామా పత్రాలు అందజేశారు.

ప్రజల ఆశీస్సులతోనే అభివృద్ధి

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



నందిగామ టౌన్: ప్రజలకు మంచి చేయాలనే ఆశయంతో రాజకీయాల్లోకి వచ్చిన తనను ప్రజలు ఆశీర్వదించడంతో వారి ఆశయాలకనుగుణంగా నందిగామ పట్టణాన్ని అభివృద్ధిపథంలో నడిపిస్తున్నానని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ అభ్యర్థి డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. పట్టణంలోని 12వవార్డు పరిధిలోని కేవీఆర్ కళాశాల వెనుక, కాకతీయ పాఠశాల,తదితర ప్రాంతాల్లో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికలలో సైతం మరోసారి అండగా నిలిచి ఆశీర్వదించాలని కోరారు. ఇంటింటి ప్రచారంలో భాగంగా ప్రజల ఇళ్ల వద్దకు వెళ్లిన ఎమ్మెల్యేకు మహిళలు హారతులిచ్చి ఆత్మీయ స్వాగతం పలికారు.

సీఎం రోడ్డుకు మహర్దశ..

ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు మాట్లాడుతూ ప్రజల మనసు గెలుచుకునేలా నా ఐదేళ్ల పాలన సాగించానని భావిస్తున్నట్లు చెప్పారు. గతంలో ఏప్రభుత్వం.. ఏప్రజాప్రతినిధి చేయలేని సీఎం రోడ్డు విస్తరణ, అభివృద్ధిని తాము చేసి చూపించామని తెలిపారు. ఓట్లు, సీట్లు కోసం ఆలోచించే మనస్తత్వం తనది కాదని, ప్రజల అవసరాల కన్నా రాజకీయాలు ఎక్కువ కాదని స్పష్టం చేశారు. స్వార్థరాజకీయాలతో గత పాలకులు సీఎం రోడ్డు విస్తరణ, అభివృద్ధిని పక్కన పెట్టారని గుర్తుచేశారు. తాము అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే రహదారి పనులను ప్రారంభించి, ఆ ప్రాంత ప్రజల పూర్తి సహకారంతో నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయగలిగామని గుర్తుచేశారు. ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు ఆయన చెప్పారు. నందిగామను మరింత అభివృద్ధిపథంలో నడిపిస్తానని, రానున్న ఎన్నికలలో తనను మరోసారి గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, వాణిజ్య విభాగం కార్యదర్శి చల్లా బ్రహ్మేశ్వరరావు, వార్డు కన్వీనర్ కోమటి రవికుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఓర్సు లక్ష్మి, నాయకులు బొంతు సతీష్‌రెడ్డి, చిరుమామిళ్ల చైతన్యకుమార్, గుడివాడ సాంబశివరావు, బండారు గంగమ్మ, విజయమ్మ, నెలకుదిటి శివనాగేశ్వరరావు, వైఎస్ఎన్ ప్రసాద్, ఓర్సు జ్వాలా, పాకాలపాటి కిరణ్, పిల్లి జయరాజు, షేక్ ఫాతిమా, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ ప్రతిష్ఠలు



పెంట్యాలవారిగూడెం(వత్సవాయి): మండలంలోని పెంట్యాలవారిగూడెం గ్రామంలోని శ్రీకోదండ రామ, దాసాంజనేయ, ముత్యాలమ్మ, అంకమ్మ, గోపయ్య సమేత లక్ష్మి తిరుపతమ్మ, యల్లయ్య ఆలయాలతోపాటు నాభి శిల ప్రతిష్ఠా మహోత్సవాలను బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. భారీసంఖ్యలో భక్తులు స్వామివార్లను దర్శించుకుని పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. ఆలయాల ప్రతిష్ఠా కార్యక్రమానికి జగ్గయ్యపేట ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను హాజరై స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు. ఆలయ కమిటీ ఆయనను ఘనంగా సత్కరించింది. ప్రతిష్ఠ సందర్భంగా ఎటువంటి వివాదాలు చోటుచేసుకోకుండా ఎస్‌ఐ బి.అభిమన్యు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఆలయ ప్రతిష్ఠను పురస్కరించుకుని భారీగా తరలి వచ్చిన బంధుమిత్రులతో గ్రామంలో సందడి నెలకొంది.

రాజకీయ పార్టీల నాయకులతో సమీక్ష

నందిగామ: అన్ని రాజకీయపార్టీల నాయకులు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను విధిగా పాటించాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో ఏ రవీంద్రరావు సూచించారు. తన కార్యాలయంలో బుధవారం ఆయన అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమీక్ష నిర్వహించారు. ఆర్డీవో మాట్లాడుతూ ర్యాలీ, సమావేశాల నిర్వహణ, పార్టీ కార్యాలయాలు, వాహనాల ఏర్పాటుకు ముందస్తు అనుమతులు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల నేపథ్యంలో అన్ని రాజకీయ పార్టీల నాయకుల కదలికలపై నిఘా ఉంచినట్లు తెలిపారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అందరూ సహకరించాలని కోరారు. నామినేషన్ ప్రక్రియను వారికి వివరించారు. ఎన్నికల నిబంధనలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు.